ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 7 జనవరి 2024



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



ఎన్నికలను శాంతియుతంగా జరిపించాలి

● ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప (క్రైం), జనవరి 6: రానున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎంపిక చేసిన సిబ్బందికి సెక్టార్ పోలీసు ఆఫీసర్స్ శిక్షణ కార్యక్రమం శనివారం స్థానిక ఉమేష్‌చంద్ర స్మారక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత ఎన్నికల్లో నమోదై ట్రయల్ నడుస్తున్న కేసుల స్థితిగతులు, జిల్లాలో గుర్తించిన అతి సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలు, లైసెన్స్ తుపాకులు, ఎన్‌బీడబ్ల్యూఎస్ గ్రామాలకు సంబంధించిన సమాచారం, చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంటు చర్యలు మరియు ఇతర అంశాలను సమీక్షించి పలు సూచనలు చేశారు. రాబోవు ఎన్నికలను శాంతియుతంగా జరిపించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను మెరుగుపరచుకుని సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తించి వారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. సమష్టి కృషి, సమన్వయంతో మద్యం, గంజాయి, నాటుసారా అక్రమ రవాణాను నియంత్రించాలని, తరచూ కార్డన్ సెర్చ్ నిర్వహించాలని అన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. పెండింగు ఎన్‌బీడబ్ల్యూఎస్‌ను ప్రత్యేక టీంతో త్వరితగతిన ఎగ్జిక్యూట్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ప్రవీణ్‌కుమార్, ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న పోలీసు అధికారులు



● కడప, రాయచోటి
రాజంపేటలో

నేడే ముగ్గుల పోటీలు

తెలుగు సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సంక్రాంతిని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఈసారి ఆదివారం కడప, రాయచోటి, రాజంపేటలలో నిర్వహిస్తోంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులపోటీలు..రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, ఎయిమ్ ఇనిస్టిట్యూట్స్ సౌజన్యంతో మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. కడప నగరంలో ఐటీఐ దగ్గర వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో, రాయచోటిలో కొత్తపేట రోడ్డులోని రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్ (ఒలంపియాడ్ బ్రాంచ్)లో, రాజంపేటలో శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికయ్యే ఇద్దరు.. మొత్తం 15 మందికి విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. కడపలో జరిగే పోటీలకు వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో జరిగే పోటీలకు రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్, రాజంపేటలో జరిగే పోటీలకు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

- కడప, ఆంధ్రజ్యోతి

సైకో పాలన తరిమికొడదాం

● వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించండి
● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 6: రాష్ట్రంలో సైకో పాలనను తరిమికొట్టేందుకు ప్రజలందరూ కలిసిరావాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. అవినీతి, అక్రమ అరాచక పాలనకు స్వస్తి పలకాలన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. శనివారం ద్వారకానగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగున్నర సంవత్సరాల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. సైకో పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలని అన్నారు. కులాలు, ప్రాంతాలు, వర్గాలు విడగొట్టి రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి సర్వనాశనం చేశాడని ఆరోపించారు. మహిళల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎస్టీ ఎస్సీ బీసీ మైనార్టీలను అణగదొక్కాడని తెలిపారు. కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారన్నారు. రాబోవు 25 రోజుల్లో 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో టీడీపీ అధినేత బహిరంగసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని కాపాడేందుకు మేధావులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన సంయుక్తంగా ఏర్పడే ప్రభుత్వంలో సూపర్‌సిక్స్ పథకాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు టీడీపీ ప్రభుత్వం అందజేస్తుందని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుందని అన్నారు. యువతకు నిరుద్యోగ భృతి కల్పించడం జరుగుతుందని, అలాగే రాబోవు ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించి కోటి కుటుంబాల్లో ఆనందాన్ని నింపేందుకు టీడీపీ అధినేత కార్యాచరణ రూపొందిస్తున్నారని స్పష్టం చేశారు.

అంగన్వాడీల సమ్మెపై నిషేధం

● కలెక్టర్ విజయరామరాజు



కడప(కలెక్టరేట్), జనవరి 6: ఆంధ్రప్రదేశ్ ఎసెన్షియల్ సర్వీసెస్ అండ్ మెయింటెనెన్స్ యాక్టు, 1971లోని సెక్షన్-3 లోని సబ్‌సెక్షన్ (1, 3) అధికారాలను బట్టి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు 6 నెలల పాటు సమ్మెలో పాల్గొనడం నిషేధించారని కలెక్టర్ విజయరామ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం అనుబంధ పోషకాహారానికి ఏర్పాట్లు, అంచనాలు వేయడం, పోషకాహారం నిరంతరంగా సరఫరా అయ్యేలా చూడడం రాష్ట్ర ప్రభుత్వాల విధి అన్నారు. గత నెల 12వ తేదీ నుంచి అంగన్వాడీల నిరవధిక సమ్మెవల్ల బడుగు బలహీన వర్గాలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, 6 ఏళ్ల లోపు చిన్నారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అభిప్రాయపడ్డారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల సమ్మెపై నిషేధాన్ని అమలు చేయడం అవసరమని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. ఈ మేరకు అంగన్వాడీలు సమ్మెలో పాల్గొనరాదని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

● తమకు ప్రాధాన్యత లేదంటూ వైసీపీలో ముఖ్యనేతపై ఆగ్రహం
● సైకిలెక్కేందుకు ప్రయత్నాలు
● 22 మంది కార్పొరేటర్లు
ఫ్యాన్ స్విచ్ ఆపి సైకిలెక్కేందుకు రెడీ
● కడప వైసీపీలో కాక రేపుతున్న రాజకీయాలు

కార్పొరేటర్లు గరం గరం



జెను.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత జిల్లాలోనే ఆయనపై కరుడుగట్టిన అభిమానుల్లో కూడా వ్యతిరేకత ఉందంటున్నారు. ఇక కడప నగరంలో జగన్ పార్టీకి జనం మాత్రమే కాదు.. సొంత బ్యాచే వ్యతిరేకంగా మారుతున్నారు. ఒకరిద్దరు కాదు 22 మంది కార్పొరేటర్లు వైసీపీని వీడే యోచనలో ఉన్నారనే ప్రచారం హాట్‌టాపిక్‌గా మారింది. ఓ ముఖ్యనేత తమకు కనీసపాటి విలువ ఇవ్వకపోవడం, ప్రభుత్వ తీరుతో ఇటు జనంలో తమపట్ల వ్యతిరేకత పెరగడంతో కార్పొరేటర్లు ఆందోళన చెందుతున్నారు. వీరు సైకిలెక్కేందుకు సిద్ధమవుతుండటంతో కడప రాజకీయాలు కాకరేపుతున్నాయి.



(కడప-ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జమానా నుంచి వారి కుటుంబాన్ని కడప అక్కున చేర్చుకుంది. రాజశేఖర్‌రెడ్డి హయాంలో కడపపై తన మార్కు చూపించుకున్నారు. మున్సిపాలిటీగా ఉన్న కడపను కార్పొరేషన్‌గా మార్చారు. 2005 తరువాత వరుసగా అప్పట్లో కాంగ్రెస్ తరువాత వైసీపీనే కడప మేయరు పదవి చేపట్టారు. జగన్ పార్టీ పెట్టిన తరువాత కార్పొరేటర్లంతా కాంగ్రెస్‌కు బై చెప్పి వైసీపీ గూటికి చేరారు. 2014-19 ఎన్నికల్లో ఆ పార్టీని గెలిపించారు. కడప కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయి. వీరిలో ఒకరు టీడీపీ నుంచి కాగా, మరొకరు ఇండిపెండెంట్ అభ్యర్థి మిగతా వారంతా వైసీపీ వారే కావడం విశేషం. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందనే పాజిటివ్ వేవ్స్ క్షేత్రస్థాయిలోకి వెళ్లిపోయాయి. ఈ సారి టీడీపీ వస్తుందనే నమ్మకం వైసీపీ వీరాభిమానుల్లోనూ బలపడింది. ఈ పరిణామాలన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తున్న కార్పొరేటర్లు ఒక అంచనాకు వచ్చారు. ఈసారి చంద్రబాబే సీఎం అనే నిర్ణయానికి వచ్చేశారు. దీంతో మెల్లిగా టీడీపీ వారితో టచ్‌లోకి వెళుతున్నారు.

మన సినిమా క్లోజ్

"సీఎం జగన్ సహా మనమంతా నవరత్నాలే మనకు బలం అనుకున్నాం. ఎలాంటి అభివృద్ధి లేకున్నా పథకాల ద్వారా లబ్ధి పొందిన జనం ఓట్లేస్తారని నమ్మాం. దీంతో ఓటర్లను కలిసే యత్నం చేయలేదు. జగన్ కూడా పథకాలు పొందిన వారంతా ఓట్లు గుద్దేస్తారనే అంటున్నారు. అయితే గ్రౌండ్‌లెవల్ పరిస్థితి వేరు. చెత్త పన్ను, ఆస్తి, కరెంటు బిల్లుల వ్యవహారం.. అన్నీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నాయి. జనం వైసీపీకి యాంటీగా ఉన్నారు. మనం ఈసారి గెలిచే చాన్స్ లేదు. వైసీపీలో ఉంటే మన సినిమా క్లోజ్ అయిపోతుంది" అంటూ ఇటీవల జరిగిన ఓ కార్పొరేటర్ల సమావేశంలో వీరంతా మాట్లాడుకున్నట్లు చెబుతున్నారు.

రోడ్ల విస్తరణతో..

కడప నగరం జిల్లా హెడ్‌క్వార్టర్. ఓ విధంగా చెప్పాలంటే రాయలసీమకే అడ్డా. ఇంత కీలకమైన కడప అభివృద్ధిని సీఎం, డిప్యూటీ సీఎం, మేయర్ విస్మరించారనే ప్రచారం ఉంది. ఎన్నికల్లో లబ్ధి కోసం ఎన్నికల ముందు ఏదో రెండు మూడురోడ్ల విస్తరణ, కూడళ్లను హడావుడిగా అభివృద్ధి చేసి కడపను కూడా డెవలప్ చేశామని చెప్పుకునేందుకు తాపత్రయ పడుతున్నారు. నగరంలో 3 నుంచి 4లక్షల జనాభా ఉంటుంది. వారి ఓట్లు కూడా ఇక్కడే ఉంటాయి. ఈ డెవలప్‌మెంటు పనులతో జనం మూడ్ మారుతుందనుకున్నారు. అయితే.. ఈ హడావుడి పనులు కేవలం ఎన్నికల స్టంటే అని జనం సైతం గ్రహించారు. దీనికి తోడు నగరంలో తిరిగే ప్రతి ఒక్కరూ ఇక్కడ జరుగుతున్న పనుల్లో నాణ్యత లేదని అంటున్నారు. ఇది వైసీపీ నేతలకు ఇబ్బందికరంగా మారింది.

కార్పొరేటర్లకేదీ గౌరవం

జగన్ సీఎం కాకముందు కార్పొరేటర్లకు ఆ పార్టీ అధినాయకత్వంతో పాటు జనంలో విలువ ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పదవులకే అర్థం లేదంటారు. ఎందుకంటే కార్పొరేషన్ ఎన్నికల్లో సగం మంది కార్పొరేటర్లు ప్రత్యర్థులను నయానాభయానా బెదిరించేసి పోటీ లేకుండా చూసుకున్నారు. నామినేషన్ల పరిశీలన నుంచి రకరకాల బెదిరింపులు సాకులతో పోటీ నుంచి విరమింపజేశారు. అందుకే 50 మంది కార్పొరేటర్లకు గాను వైసీపీ వారే 48 మంది గెలిచారు. వైసీపీ పెద్దలు కూడా వీరంతా మేం టికెట్ ఇస్తే ఎలక్షన్ లేకుండా ఎన్నికయ్యారని అనుకున్నట్లున్నారు. అందుకే కార్పొరేటర్లంటే విలువ లేదనే ప్రచారం ఆ పార్టీ వర్గాల్లోనే ఉంది. కార్పొరేషన్‌కు చెందిన ఓ ముఖ్యనేత "నేను టికెట్ ఇవ్వడం వల్లనే మీరు గెలిచారు. నేను చెప్పిందే వినండి, కార్పొరేషన్ సమావేశాల్లో కామ్‌గా ఉండండి. ఏ నిర్ణయాలకూ వ్యతిరేకంగా మాట్లాడొద్దు" అని చెప్పారని సమాచారం.

ఇక రాష్ట్రస్థాయిలో కీలకంగా ఉన్న ఓ నేత మొదటినుంచి తన సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారనే ప్రచారం ఉంది. ఆయన కూడా కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాల గురించి ఎవరైనా కార్పొరేటర్లు ప్రశ్నిస్తే అలాంటి వారిని దూరం పెడతారంటారు. సమస్యలు చెప్పుకుంటే పట్టించుకోకపోవడంతో ఆయన సామాజికవర్గానికి చెందిన కార్పొరేటరుతో పాటు మరో ముగ్గురు ఆయనకు దూరంగా ఉన్నట్లు చెబుతున్నారు. మిగిలిన కార్పొరేటర్లకూ పార్టీ పెద్దల వద్ద ఏమాత్రం విలువ లేకుండా పోయింది. కేవలం ఉత్సవ విగ్రహాల్లా ఉన్నారు తప్ప ఒక్క పనీ చేసుకోలేకపోతున్నామనే అసంతృప్తి వీరిలో ఉంది. అటు పార్టీ పెద్దలు పట్టించుకోక, ఇటు జనం వ్యతిరేకించడం చూశాక.. ఇక్కడుంటే మనం మునిగిపోతాం, జనం యాంటీగా ఉన్నారు అని డిసైడ్ అయి టీడీపీ పట్ల ఆసక్తి చూపుతున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పాత మున్సిపాలిటీ, చిన్నచౌకు, విలీన పంచాయతీలకు చెందిన 22 మంది కార్పొరేటర్లు టీడీపీ ముఖ్యనేతకు టచ్‌లోకి వెళ్లి విషెస్ చెప్పారని, సంక్రాంతి తరువాత పార్టీలోకి వస్తామంటూ వారితో నేరుగా అన్నారని వైసీపీలో ప్రచారం జరుగుతోంది. జగన్‌ను ఆరాధించే కార్పొరేటర్లే సైకిలెక్కేందుకు మార్గం సుగమం చేసుకోవడం వైసీపీలో హాట్‌టాపిక్‌గా మారింది.



కలెక్టరేట్ ఎదుట ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు
కొండాపురంలో మెడలకు ఉరితాళ్లతో అంగన్వాడీల నిరసన
24గంటల దీక్షలో భాగంగా శనివారం రాత్రి కలెక్టరేట్ ఎదుట నిద్రించిన అంగన్వాడీలు

తగ్గేదేలే..

● న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తే పట్టించుకోరా
● ఎస్మా ప్రయోగించి భయపెట్టాలని చూస్తారా?
● ప్రభుత్వంపై అంగన్వాడీల ఆగ్రహం
● జీవో ప్రతులు దహనం
● కొనసాగిన మున్సిపల్ కార్మికుల ఆందోళన
● కడప కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి

(కడప-ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాలు, ప్రతిపక్ష నేత హోదాలో జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలంటూ గత 26 రోజులుగా అంగన్వాడీలు న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో హామీలిచ్చి మా ఓట్లు పొంది గద్దె నెక్కాక మమ్మల్ని పట్టించుకోకుండా వదిలేశారు. పిల్లలు, ఇంటిని కుటుంబాలను వదిలేసి రోడ్డెక్కి సమ్మె చేస్తున్నాం. మా సమస్యలు పరిష్కరించాల్సింది పోయి ఎస్మాతో భయపెట్టాలని చూస్తారా అంటూ అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరెంత భయపెట్టినా తగ్గేదేలే అని హెచ్చరించారు.

శనివారం జిల్లాలో అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు వేర్వేరుగా సమ్మె కొనసాగించారు. రోడ్డెక్కి సమ్మె చేస్తున్నా కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. కడపలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు 24గంటల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. ఎర్రగుంట్లలో అంగన్వాడీల ధర్నాకు టీడీపీ నాయకులు సీఎం సురేశ్‌నాయుడు సంఘీభావం ప్రకటించారు. పోరుమామిళ్లలో మూతికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి వినతిపత్రం అందించారు. కొండాపురంలో మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. చాపాడు, ముద్దనూరు, బద్వేలు, వేంపల్లెలో దీక్షలు కొనసాగించారు.

● ఇక మున్సిపల్ కార్మికులు ఆందోళన కొనసాగించారు. కడప కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీసులు అడ్డుకున్నా లెక్క చేయకుండా గేటు నెట్టేసుకుని కార్పొరేషన్‌లో వెళ్లారు. అంతకు ముందు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ వీరికి మద్దతు తెలిపారు. బద్వేలు, మైదుకూరులో ధర్నా నిర్వహించారు. ప్రొద్దుటూరులో మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు.



ప్రొద్దుటూరులో మున్సిపల్ కార్మికుల ఆందోళన



కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

ఓటరు దరఖాస్తుకు ఇక వారం రోజులే

కడప(కలెక్టరేట్), జనవరి 6: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సిద్ధమౌతోంది. ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వుల మేరకు ఈ నెల 5 నాటికి ఓటర్ల తుది జాబితా విడుదల చేయాల్సి ఉంది. ఈ మేరకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పూర్తి స్థాయిలో కసరత్తు చేసింది. జిల్లాలోని కడప పార్లమెంట్ పరిధిలో 16,13,479 మందికి ఓటు కల్పించారు. కాగా.. కొత్తగా ఓటరు దరఖాస్తుకు, మార్పు చేర్పులకు ఈ నెల 12వ తేదీ వరకు ఎన్నికల కమిషన్ గడువు పొడిగించింది. ఓటరుగా నమోదుకు ఇక వారం రోజులు మాత్రమే గడువు ఉన్నందున యువత వెంటనే బీఎల్వోల వద్ద, తహశీల్దారు కార్యాలయంలో కానీ, ఆన్‌లైన్‌లో కానీ నమోదు చేసుకోవాలి. లేక పోతే మళ్లీ మీ ఓటు వినియోగించుకోవాలంటే ఐదేళ్ల వరకు వేచి చూడాల్సిందే

4,23,307 దరఖాస్తులు

జిల్లాలో ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, సవరణలకు సంబంధించి ఫామ్ 6, 7, 8 దరఖాస్తులు 4,23,307 వచ్చాయి. వీటిలో 3,73,772 క్లెయిమ్స్ పరిశీలించి అనుమతించారు. మరో 41,984 దరఖాస్తులను తిరస్కరించగా 7,098 పెండింగ్‌లో ఉన్నాయి. ఈనెల 12 వతేదీ వరకు వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించిన మీదట 22వ తేదీ ఓటర్ల తుది జాబితా విడుదల కానుంది. దీంతో మరో రెండు మూడు వేల ఓట్లు పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఓటర్ల నమోదులో అక్రమాలు

కాగా.. ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపుల ప్రక్రియలో అక్కడక్కడ కొన్ని చోట్ల వైసీపీ నేతల కనుసన్నల్లో కొందరు అధికారులు, బీఎల్వోలు అక్రమాలకు పాల్పడ్డారంటూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదులు చేరాయి. ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఎన్నికల కమిషన్ అక్రమాలు జరిగాయని గుర్తించడంతో ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి రామ్మోహన్‌ను రెండు రోజుల క్రితం సస్పెండ్ చేసింది. దీంతో మిగతా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు, ఎన్నికల యంత్రాంగానికి ముచ్చెమటలు తప్పలేదు. మిగిలిన ఫిర్యాదులపై కూడా నిష్పాక్షికంగా విచారణ జరిపితే మరిన్ని దొంగ ఓటర్లు తొలగిపోయే అవకాశం ఉందని ప్రతిపక్షాలు అంటున్నాయి.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

ఒకప్పుడు ఉపాధి పనులకు వెళ్తే ఫలానా సమయంలో డబ్బులు చేతికందుతుందనే నమ్మకం ఉండేది. తద్వారా కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. కానీ ఈ ప్రభుత్వంలో ఎప్పుడు వస్తుందో.. ఏమో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతంలో రెండు వారాలకొకసారి కూలి డబ్బులు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు మూడు నెలలైనా కూలీ డబ్బులు రాక ఆకలితో అలమటిస్తున్నారు. అసలు ఎప్పుడు ఇస్తారన్న విషయం కూడా తెలియక అయోమయంలో ఉన్నారు. 10 రోజుల్లో సంక్రాంతి రానే వస్తోంది. పండుగ పూటా పస్తులు ఉండాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మూడు నెలలుగా ఎదురు చూపులే..! ● పండుగ పూట పేదలు పస్తులేనా..?



సాతపల్లె కుంటలో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

పెనగలూరు, జనవరి 6: ప్రస్తుత కాలంలో నిరుపేద కూలీలకు ఉపాధి హామీ పథకం పనులే శరణ్యమయ్యాయి. ఈ పనులు తప్ప మరో గత్యంతరం లేక నిరుపేద వ్యవసాయ కూలీలతో పాటు, భవన నిర్మాణ కార్మికులు, కౌలు రైతులు, మోతుబరి రైతులు కూడా ఈ పనులకే వెళుతున్నారు. అందువల్ల పేద, మధ్య తరగతి ప్రజలు కూడా ఏ మాత్రం వెనకాడకుండా నిత్యం ఉపాధి హామీ పనులకు వెళ తున్నారు. గతంలో రెండు వారాలకొకసారి తప్పనిసరి కాకపోయినా మూడవ వారంలో కూలీ డబ్బులు వచ్చేవి. దాదాపు నెలయ్యే సరికి కూలీ డబ్బులు చేతికందు తున్నందున కూలీలు ఎలాగోలా తమ సంసారాన్ని నెట్టుకొచ్చేవారు. కానీ ఈ ప్రభుత్వంలో మూడు నెలలుగా కూలీలకు డబ్బులు చెల్లింపులు జరపడం లేదు. ఈ వారం కాకపోయినా మళ్లి వారమైనా అకౌంట్లలో డబ్బులు పడతాయేమోనని కూలీలు నిత్యం బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ నిరు త్సాహంగా వెనుదిరుగుతున్నారు. సంక్రాంతి పండుగ సరిగ్గా 10 రోజులు కూడా లేకపోవడంతో పండగకైనా కూలీ డబ్బులు వస్తాయో రావోనని ఆవేదనలో ఉన్నారు. అప్పటికి కూడా కూలీ డబ్బులు రాకపోతే పండుగ ఎలా చేసు కోవాలంటున్నారు. తాము చేసిన పనులను బట్టి ఒక్కో కూలీకి సగటున రూ.8 వేల నుంచి రూ.10 వేల దాకా కూలీ డబ్బులు రావాలని చెబుతున్నారు. మండల వ్యాప్తంగా రోజుకు 300 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఈ లెక్కన రూ.30 లక్షలు పైబడి కూలీ డబ్బులు రావాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్న ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కూలీలకు చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పండక్కు గుడ్డలు ఎప్పుడు తెస్తావంటున్నారు



మూడు నెలల నుంచి కూలీ డబ్బులు రాలేదు. పండుగ దగ్గర కొస్తోంది. పిల్లలు కొత్త గుడ్డలు ఇంకెప్పుడు తెస్తావంటున్నారు. ఇంట్లో ఏం సమాధానం చెప్పాలో దిక్కు తోచడం లేదు. ఏ పనులు లేక ఉపాధి పనులకు వెళితే.. డబ్బులు ఇవ్వకపోతే సంసారం ఎట్టా గడిసేది.

- నేతగాని చిన్నక్క, సాతపల్లి హరిజనవాడ

బ్యాంకుల చుట్టూ తిరిగి కాళ్లరుగుతున్నాయి



తాను ఇటుకలు తయారీ పనిలో ఆరితేరిన వాడిని. ఇటుకలకు డిమాండు తగ్గడంతో ఉపాధి కూలీ పనికి వెళుతున్నా.. నాకు ఆరు వారాల కూలీ డబ్బు రావాలి. ఎప్పు డొస్తుందా అని ఎదురు చూస్తున్నా. బ్యాంకుల చుట్టూ తిరి గి తిరిగి కాళ్లు అరుగుతు న్నాయే తప్పితే కూలీ డబ్బులు మాత్రం అకౌంట్‌లో పడలేదు.

- బద్దల వెంకటేష్, సాతపల్లి హరిజనవాడ

వ్యవసాయ పనులు లేక...



నేను సాధారణ వ్యవసాయ రైతును. చెరువు కట్ట తెగి పోవడంతో రెండేళ్లుగా పెనగలూరు ఆయకట్టు బీడుగా మారిపోయింది. అప్పటి నుంచి ఉపాధి హామీ పనికిపోతున్నా.. నాకు 8 వారాల డబ్బులు రావాలి. వ్యవసాయ పనులు లేవని దీనికొస్తే ఇదీ అలాగే కాలబడింది.

- కలివేల కృష్ణయ్య, పెనగలూరు

ఏపీవో మురళి ఏమంటున్నారంటే..



మండలంలో నిత్యం 300 మందికి తగ్గకుండా కూలీలు పూడికతీత పనులు చేస్తున్నారు. అలాగే కంద కాల తవ్వకం, పండ్లతోటల లో గడ్డి, పిచ్చి మొక్కల తవ్వకం, నీరుపోయడం చేస్తున్నారు. అక్టోబరు 15 నుంచి కూలీ చెల్లింపులు జరగకపోవడం వాస్తవమే.

- మురళి, ఏపీవో, పెనగలూరు

విషపదార్థం తిని మూడు నెమళ్లు మృతి



మృతిచెందిన నెమళ్లకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న దృశ్యం

ముద్దనూరు జనవరి 6: స్థానిక అటవీ శాఖ రేంజ్ కార్యాలయం వద్ద శనివారం విషపదార్థం తిని మృతి చెందిన నెమళ్లకు పశువైద్యాధికారి హిమబిందు పోస్టుమార్టం నిర్వహించారు. అటవీ రేంజిఅధికారి అశోక్‌కుమార్‌యాదవ్ సమాచారం మేరకు.. మండల పరిధి చిన్నదుద్యాల గ్రామ పొలాల సమీపంలోని గాలేరు-నగిరి కాల్వ వద్ద శుక్రవారం 3 నెమళ్లు గాలిలో విలవిల్లాడి కిందపడి చనిపోయాయని రైతులు గుర్తించారు. నెమళ్లకు పోస్టుమార్టం నిర్వహించి, కాల్చివేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు రత్నరాజు, రజనీకుమార్,పద్మనాభయ్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

దువ్వూరు(మైదుకూరు), జనవరి 6: ప్రతి రోజు కూరగాయలు అమ్ముకొంటూ జీవనం గడిపే వృద్ధురాలు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన ఘటన శనివారం ఉదయం దువ్వూరు మండలం ఇడమడక వద్ద జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. ఇడమడకకు చెందిన మహబూబ్‌బీ (72) నిత్యం దువ్వూరు నుంచి కూరగాయలు తెచ్చుకుని అమ్ముకుంటుండేది. ఈ క్రమంలో శనివారం ఉద యం దువ్వూరులో కూరగాయలు తీసుకొని, చాగలమర్రికి చెందిన పుల్లయ్య ద్విచక్రవాహనంలో ఇడమడకకు పోతుండగా వెనుక వైపున కారు ఢీకొంది. ఈ ఘటనలో మహబూబ్‌బీ అక్కడికక్కడే మృతి చెందగా, పుల్లయ్య తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

అధికారులపై జేసీ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గణేశ్‌కుమార్

కడప(కలెక్టరేట్), జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బాధ్యతలు అప్పగించిన అధికారులు ఇంతవరకూ ఆడిన క్రీడల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల తీరుపై జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కలెక్టరేట్ స్పందన హాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణపై సంబంధిత నోడల్ అధికారులు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ఆసక్తి, మానసిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అన్ని వయసుల వారు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు విధులు కేటాయించిన అధికారులు బాధ్యతగా అన్ని దశలను సంపూర్తి చేయాల న్నారు. క్షేత్ర స్థాయిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అధి కారులు ప్రణాళికతో పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు క్రీడా ప్రాంగణాల్లో అన్నిరకాల వసతులు కల్పించి, క్రీడలను వీక్షిం చేందుకు స్థానికులు ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు, మండల ప్రత్యేకాధికారులు, డీఎల్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.


నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ

మైదుకూరు, జనవరి 6: ఒక కేసు విషయంలో ముద్దాయిగా ఉంటూ కోర్టుకు హాజరుకాకపోవడంపై నాన్‌బెయిలబుల్ వారెంటును జారీ చేసినట్లు ఎస్‌ఐ మద్దిలేటి ఒక ప్రకటనలో తెలిపారు. 190/2011 కేసుకు సంబంధించి కాశినాయన మండలం అమగంపల్లెకు చెందిన చెంచుల విజయ్‌కుమార్ అలియాస్ రాబర్ట్ ముద్దాయిగా, అరెస్టు వారెంట్ ఉందని పలుమార్లు కోర్టుకు హాజరుకానందుకు నాన్‌బెయిలబుల్ జారీ చేశారన్నారు. ఈనెల 18 లోపు స్టేషన్‌లోగాని లేదా నేరుగాగాని హాజరుకావాలని ఆయన తెలిపారు.

ఆటో బోల్తా ఒకరి మృతి

కొండాపురం, జనవరి 6: మండలంలోని దొబ్బుడుపల్లె-నక్కానిపల్లె గ్రామాల మధ్యలో శుక్రవారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో షేక్షావలి(35) అనే వ్యక్తి మృతిచెందాడు. ఎర్రగుడి గ్రామానికి చెందిన షేక్షావలి, సుబ్బరాయుడు మైలవరం మండలంలోని బుచ్చంపల్లె గ్రామంలో బియ్యం కొనుగోలు చేసి తీసుకెళుతుండంగా ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవింగ్ చేస్తున్న షేక్షావలి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి సుబ్బరాయుడు గాయపడగా ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ మోహన్ తెలిపారు.

జాతీయ హాకీ జట్టుకు శాంకరి ఎపిక



విద్యార్థినిని అభినందిస్తున్న సీఈఓ భానుప్రకాష్

పులివెందులటౌన్, జనవరి 6: అండర్-14 హాకీ జాతీయ జట్టుకు పులివెందుల విద్యార్థి శాంకరి ఎంపికైనట్లు విద్యాధరి స్కూల్ సీఈఓ భానుప్రకాష్ తెలిపారు. 2023 డిసెంబరు 31 నుంచి 2024 జనవరి 3వ తేది వరకు గ్వాలియర్‌లో ఎస్‌జీ ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంతర్‌రాష్ట్ర అండర్-14 బాలికల హాకీ టోర్నమెట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొని ప్రతిభ చూపిందన్నారు. దీంతో జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైంద న్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని శాంకరిని పాఠశాల సీఈఓ, కరస్పాండెంట్ నాగరాజు, ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యా యులు అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పాదచారి మృతి

ఓబులవారిపల్లె, జనవరి 6: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ పాదచారి మృతి చెందాడు. మంగంపేటలోని ఆర్ఆర్ వీధికి చెందిన షేక్ రంజాన్ (47) లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

● 300 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని, నిందితులను అదుపులోకి తీసుకున్న విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), జనవరి 6: జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిపోతున్న పీడీఎస్ రేషన్ బియ్యంను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి సీజ్ చేశారు. అందిన సమాచారంపై కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మసూంబాష ఆదేశాలతో చెన్నూరు నుంచి కడప మీదుగా కర్ణాటక రాష్ట్రానికి పీడీఎస్ రేషన్ బియ్యంను అక్రమంగా వాహనంలో తరలిస్తుండగా సీకేదిన్నె మండలం బుగ్గ అగ్రహారం రోడ్డులోని శ్రీ సాయి గణేశ్ గోడౌన్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 14,200 కిలోల రేషన్ బియ్యం, ఏపీ04 యుప 0045 నెంబరు ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెన్నూరు వాసులు కాటం బ్రహ్మయ్య, కొండూరి హరిక్రిష్ణ చెన్నూరు చుట్టుపక్కల గ్రామాల్లోని ఇళ్లల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి అక్కడి ఓ ఇంట్లో నిల్వ ఉంచి అనంతరం కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. సదరు వాహనాన్ని తనిఖీ చేసి రేషన్ బియ్యం, ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం విలువ రూ.17,75,100లుగా నిర్ధారించినట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీకెదిన్నె ఎస్‌ఐ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఈదురు బాషా, జి.శ్రీనివాసులు, అసిస్టెంట్ జియాలజిస్ట్ బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసరు, సీఎస్‌డీటీ పి.సౌజన్య, బుగ్గఅగ్రహారం వీఆర్వో శిఖామణి, విజిలెన్స్ సిబ్బంది నాగేశ్వర్‌రావు, క్రిష్టానాయక్, రంతుబాషా, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం

- స్మగ్లర్ అరెస్టు

రైల్వేకోడూరు, జనవరి 6: రైల్వేకోడూరు రేంజి పరిధి లోని గాదెల అడవిలో శనివారం అటవీశాఖ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వ హించి ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. రైల్వేకోడూరు రేంజర్ రఘు నాథరెడ్డి మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన స్మగ్లర్ చిన్న పొన్నును అదుపులోకి తీసుకుని 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో గాదెల ఎఫ్ఎస్‌వో ఎం.మహేష్ కుమార్, ఎఫ్‌బీవో బి.దేవారెడ్డి, ఎఫ్‌బీవో ఎం.నాగేశ్వర్ నాయక్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కడపలో రాష్ట్ర స్థాయి క్రికెట్ మ్యాచ్‌లు

కడప(స్పోర్ట్స్), జనవరి 6: కడప రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి (ఎ.సి.ఎ) క్రికెట్ స్టేడియంలో ఈ నెల 7 నుంచి బీసీసీఐ రాష్ట్ర స్థాయిలో కల్నల్ సి.కె. నాయుడు (అండర్-23) మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లు జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. అందులో భాగంగా 7వ తేది నుంచి 10వ తేది వరకు ఆంధ్ర- గోవా జట్ల మధ్య మొదటి మ్యాచ్ సాగనుందన్నారు. తదుపరి రెండవ మ్యాచ్ ఈ నెల 28 నుంచి 31 వరకు ఆంధ్ర- ఛత్తీస్‌ఘడ్ జట్ల మధ్య సాగుతుందన్నారు. చివరగా వచ్చే ఫిబ్రవరి 18-21 వరకు ఆంధ్ర- రైల్వేస్ జట్ల మధ్య మూడవ మ్యాచ్ ఉంటుందన్నారు.

ఎస్మా ప్రయోగం దారుణం

అంగన్వాడీలు ఎస్మా చట్ట పరిధిలోకి రారు ● భయభ్రాంతులకు గురిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
ఉద్యమాన్ని అణచివేసేలా జగన్ ప్రభుత్వం ● జీఓ ప్రతులు దహనం



కలెక్టరేట్ వద్ద రిలేదీక్షల్లో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు

కడప (నాగరాజుపేట), జనవరి6: పిచ్చుకపైన బ్రహ్మాస్త్రంలాగా అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దారుణమని, అసలు ఎస్మా చట్టం పరిధిలోకి అంగన్వాడీలు రారనే విషయం కూడా తెలియని వారు పాలకులా అంటూ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మండిపడ్డారు. ఉద్యమాన్ని అణచివేసేలా జగన్ ప్రభుత్వం అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసు కొచ్చిన జీఓ నెం.2 (ఎస్మా) ప్రతులను దహనం చేశారు. అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలంటూ కడప కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు, హెల్పర్లు చేపట్టిన రిలేదీక్షలు శనివారానికి 26వ రోజుకు చేరింది. సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో నేటి నుంచి 24 గంటల దీక్షలో కలెక్టరేట్ వద్ద రిలేదీక్షలకు పూనుకున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చే వరకూ దీక్షలు విరమించరని స్పష్టం చేశారు. అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ కొందరు ప్రభుత్వ పెద్దలు, మంత్రు లు అంగన్వాడీలను చిన్నచూపు చూస్తూ సమ్మెను విరమింజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఎస్మా దుర్మార్గం

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె కొనసాగిస్తుంటే వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని సీపీఎం కడప నగర కార్యదర్శి రామ్మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ వర్కర్లపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సరైన చర్య కాదన్నారు. గతంలో తమిళనాడు ప్రభుత్వం ఉద్యోగులపై ఈ చట్టం ప్రయోగించి అభాసుపాలవడాన్ని ఒకసారి సీఎం జగన్ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఎస్మా ప్రయోగించిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించిన సంఘటనలు లేవన్నారు. నగర కమిటీ సభ్యురాలు జమీలా పాల్గొన్నారు.

అంగన్వాడీలపై అక్కసు ఎందుకు? : ఒంటేరు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 6: సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగిస్తూ ప్రభుత్వం తన అక్కసు చూపిస్తోందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రం లాంటిదన్నారు. నేను విన్నాను, ఉన్నానని మ హిళల సమస్యలపై స్పందించే సీఎం సమస్యలను ఎస్ అమ్మా అని విని పరిష్కరించకుండా ఎస్మా ప్రయోగిస్తూ దాడి చేయడం అన్యాయమన్నారు.

ఎస్మా చట్టాన్ని ఎత్తివేయాలి

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 6: అంగన్వాడీలు రోజుల తరబడి సమ్మె చేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి అధికార బలంతో ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తారా అని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలపై ఉపయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ విలేకరులతో మాట్లాడారు. ప్రజాతంత్ర వాదులంతా ప్రభుత్వ వ్యతిరేక చర్యలను ఖండించాలని కోరారు.

ఎస్మాతో ఉద్యమం ఆపలేరు

చెన్నూరు, జనవరి 6: అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి ఉద్యమాన్ని నీరుగార్చాలనుకోవడం దారుణమని, ఉద్యమం ఆపలేరని మండల టీడీపీ కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన కోరికలపై స్పందించకపోవడం దారుణమన్నారు. మాజీ జిల్లా అధికార ప్రతినిధి ఐ.శివారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్ హుసేన్, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, మైనార్టీ జిల్లా కార్యదర్శి అహ్మద్, నియోజకవర్గ అధ్యక్షులు ఖాజా హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం : తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 6: అంగన్వాడీలపై జగన్ ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం నియంతృత్వ పోకడకు పరాకాష్ట అని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి విరుచుకుపడ్డారు. శనివారం వేంపల్లెలో మీడియాతో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థ మహోన్నతమైనది, కాంగ్రెస్ మానస పుత్రిక అన్నారు. కనీస గౌరవ వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని గాంధేయ పద్దతిలో నిరసన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ రాష్ట్ర కార్మికసంఘం....

కడప(కలెక్టరేట్) జనవరి 6: న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా అంగన్వాడీలు సమ్మె బాటపడితే పరిష్కారం చూపాల్సిన జగన్ ప్రభుత్వం జీఓ నెంబరు-2ను తెచ్చి ఎస్మా ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని కాంగ్రెస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య విమర్శించారు. అత్యవసర సర్వీసుల పేరుతో సంబంధం లేని జీఓలతో అంగన్వాడీల సమ్మెను అడ్డుకోవడం తగదని వెంటనే జీఓను ఉప సంహరించు కోవాలనీ ఆయన శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఎస్మా ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 6: సాధారణ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శమని తెలుగునాడు ప్రజా సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాయినాథశర్మ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహించారు. హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాడుతున్న అంగన్వాడీలపై రాష్ట్ర ఎస్మా అమలు చేయడం దారుణ చర్య అని అభిప్రాయ పడ్డారు. కమలాపురంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అంగన్వాడీలపై ఎస్మా అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ తకు నిదర్శనమని, చేతకాని ప్రభుత్వం దిగిపోవాలన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు మద్దతుగా ఆందోళన చేయడానికి తామూ సిద్ధంగా ఉన్నామన్నారు.

సీఆర్సీ టీడీపీలోకి రావడం అభినందనీయం



సీఆర్సీకి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న బాలిశెట్టి హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె) జనవరి 6: సుదీర్ఘ రాజకీయ అనుభవం, పేరుగాంచిన ఎమ్మెల్సీ రామచంద్రయ్య టీడీపీలోకి రావడం అభినందనీయమని టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. శనివారం బలిజ సంఘం నేతలు గోపిశెట్టి నాగరాజుతో కలిసి ఎమ్మెల్సీ నివాసంలో రామచంద్రయ్యను సన్మానించి అభినందించిన ఆయన మాట్లాడుతూ సీఆర్‌సీ సొంత గూటికి రావడం సంతోషంగా ఉందన్నారు. కాపు, బలిజలకు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఐదు శాతం రిజర్వేషన్లు జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఈ విషయమై స్పందించి బలిజల రిజర్వేషన్ సాధించేందుకు కృషి చేయాలని రామచంద్రయ్యకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో రామచంద్రయ్య రాకతో టీడీపీ మరింత బలోపేతం కానుందని తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం ప్రతినిధులు గంధం ప్రసాద్, బండారు జగన్నాధం, రెడ్డిప్రసాద్, దండు అనిల్, శివ, దండు అశోక్, జనతాదళ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ టీడీపీదే : బీటెక్ రవి

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన గంగనపల్లె నేతలను ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, జనవరి 6: అరాచక పాలనను తరిమిగొట్టి రాష్ట్రాభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేసేందుకు సిద్దంగా ఉన్నారని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. శనివారం తొండూరు మండలం గంగనపల్లెలో పలు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. రామిరెడ్డి రఘునాథరెడ్డి, రామిరెడ్డి, గంగాప్రసాద్‌రెడ్డి, అన్నారెడ్డి రామమునిరెడ్డి, వెంకటరంగారెడ్డి, రామిరెడ్డి చిన్న ఓబుళరెడ్డి తదితరులకు బీటెక్‌రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల ఇన్‌చార్జి శివమోహన్‌రెడ్డి, మండల పరిశీలకుడు జయభరత్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే టీడీపీ లక్ష్యం

- టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆర్.మాధవీరెడ్డి



బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 6: యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనే టీడీపీ లక్ష్యమని కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరం 6వ డివిజన్ నెహ్రూనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చంద్రబాబు సీఎం కావడం ఈ రాష్ట్రానికి చాలా అవసరమన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన, మహిళలకు అనేక సంక్షేమ పథకాలు, రైతులకు సదుపాయాలు అది ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, నేతలు మాసాపేటశివ, వరదా పార్వతి, కిరణ్‌యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్'తో ప్రతి కుటుంబానికీ లబ్ధి

పులివెందుల టౌన్, జనవరి 6: భవిష్యత్ టీడీపీదేనని కడప పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు దగాపడ్డారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు అనే తేడా లేకుండా పిల్ల సైకోలు కబ్జాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడితప్పిందన్నారు. మన రాష్ట్రాన్ని అరాచక పాలన నుంచి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కదలిరావాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుబానికీ లబ్ధిచేకూరుతుందన్నారు.

ముగిసిన కడప బాలోత్సవం

పిల్లల పండుగకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన



అలరించిన చిన్నారుల ఆటాపాట

కడప (కల్చరల్) జనవరి 6: పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయాలనే ధ్యేయంతో కడప బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో నగర మరియాపురం సెయింట్ జోసఫ్ బాలుర పాఠశాలలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన కడప బాలోత్సవం (పిల్లల పండుగ) ఆహ్లాదకర వాతావరణంలో ముగిశాయి. రెండు రోజులు జరిగిన సంబరాల్లో 2వ తరగతి నుంచి 10 వతరగతి విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై వివిధ సాంస్కృతిక, విజ్ఞాన, చిత్రలేఖన, ఏకపాత్రాభినయం, తదితర పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థుల నుంచి అనూహ్యస్పందన లభించింది. ముగింపు సమావేశంలో డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి కడప బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు జి. గోపాల్, కార్యదర్శి బి. లక్ష్మీరాజా మాట్లాడుతూ జీవితంలో చదువు ముఖ్యమే అయినప్పటికీ పిల్లలను ఒత్తిడితో కాకుండా ఇష్టంగా చదివే వాతావరణాన్ని కల్పించాల్సిన ఆవశ్యకత ప్రతి విద్యార్థి, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులపై వుందన్నారు. బాలోత్సవంలో 43 అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేసినట్లు వెల్లడించారు. విశ్రాంత డిప్యూటీ డీఈఓ నాగమునిరెడ్డి, విశ్రాంత హెచ్ఎం. బాలయల్లారెడ్డి, ప్రతినిధులు సునీత, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు

రెచ్చగొట్టే విధంగా మంత్రుల తీరు ● సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడి
కార్పొరేషన్ కార్యాలయం ముట్టడించిన కార్మికులు ● పోలీసులు, కార్మికుల నడుమ తోపులాట



మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్న కార్మికులు

కడప (ఎర్రముక్కపల్లె) జనవరి 6: కార్మికుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మున్సిపల్ కార్మికులు ఆరోపించారు. రెచ్చగొట్టే విధంగా మంత్రులు ప్రకటనలు చేస్తున్నారన్నారు. శనివారం సాయంత్రం ప్రభుత్వ అధికారులతో చర్చలు ఉన్నాయని, ఈ చర్చల్లో సమస్యలు పరిష్కారం కాకుంటే సోమవారం కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. శనివారం మున్సిపల్ కార్మికులసమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యక్రమంలో కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన నేతలు, కార్మికులను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటు చేసుకుని కొంత ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు కార్యాలయం నుంచి కార్మికులను బయటికి పంపించారు. కార్మిక నేత సుంకర రవి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్దతిలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెకు సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో వచ్చిన ఆదాయంలోనే మాకు ధరలకనుగుణంగా ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా దానికి తగ్గట్టు జీతాలు ఇవ్వమని కోరుతున్నామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వాన్ని ఎదుర్కొని ఎన్నో న్యాయమైన డిమాండ్లను కార్మికులు నెరవేర్చుకున్నారని, కార్మికుల పోరాటాలను ప్రతి ప్రభుత్వం చూసిందన్నారు. నేడు జగన్‌రెడ్డి మొండి వైఖరి విడనాడి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంటుచేయాలని, పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంటు బెనిఫిట్స్ గ్రాడ్యుటీ ఇవ్వాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లాప్‌ఆటో డ్రైవర్లకు కనీస వేతనం రూ.1850 ఇవ్వాలన్నారు. మున్సిపల్ ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులకు రిటైర్‌మెంటు బెనిఫిట్స్, గ్రాట్యుటీ, సగం జీతం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. పర్మినెంటు సిబ్బందికి సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలన్నారు. విలీన పంచాయతీలు కరోనా, వరదలు కొత్తగా తీసుకు న్న కార్మికులకు ఆప్కాస్ జీతాలు, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని కోరా రు. ఈ డిమాండ్లపై శనివారం సాయంత్రం ప్రభుత్వ అధికారులు, మంత్రులతో చర్చలు ఉన్నాయని ఆ చర్చల్లో కార్మికులు కోరిన న్యాయ మైన కోరికలను సమస్యలను పరిష్క రిస్తే విధుల్లో చేరతామని లేని పక్షంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. రేపటి నుంచి విద్యుత్, తాగునీరు సరఫరాకు అంతరాయం కలిగిస్తామని హెచ్చరించారు.

ఉద్రిక్తతత...

మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా కార్పొరేషన్ ముట్టడిలో భాగంగా కార్మికులు కార్పొరేషన్ కార్యాలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. కార్మికులు పోలీసులను లెక్కచేయకుండా కార్యాలయంలోకి దూసుకుపోయారు. కార్మిక సంఘం నేతలు కంచుపాటి తిరుపాల్, గోపీ, కిరణ్, శ్రీధర్ బాబు, నాగరాజ్, ఇత్తడి ప్రకాశ్, ఆదాం, వై.రమేశ్, కొండయ్య, దస్తగిరమ్మ, కొండమ్మ, ధరణి, వాటర్, ఎలక్ట్రిసిటీ, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

గ్రీవెన్స్‌డేలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప (క్రైం), జనవరి 6: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్‌డే నిర్వహిస్తున్నామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం శనివారం ఎస్పీ డీపీఓలో గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. సిబ్బంది సమస్యలను విన్న ఎస్పీ వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. సిబ్బంది ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం'

సికెదిన్నె, జనవరి 6: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. పబ్బాపురం పంచాయతీ రాయలపంతులపల్లె గ్రామాల్లో శనివారం బాబూ ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ పార్టీ నేతలతో కలిసి నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే వెంటనే చంద్రబాబు అమలు పరిచే సూపర్ 6 పథకాల గురించి వివరించారు. ప్రజలు వైసీపీ పాలనపై విసుగుచెంది ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మహిళలకు ఏడాదికి ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలు 18 ఏళ్ల పైబడి 60 ఏళ్లలోపు వారికి నెలకు రూ.1500 అందిస్తున్నామన్నారు. 60 ఏళ్ల దాటినవారికి వృద్ధాప్య పింఛను అందిస్తూ మహిళలవైపు చంద్రబాబు ఉన్నారన్నారు. టీడీపీ డాక్టర్ల సంఘం రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, టక్కోలి కృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, నడిపి వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సాహిత్యంలో సమాజం' పుస్తకావిష్కరణ



పుస్తకం అంకితం చేస్తున్న ఈశ్వర్‌రెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), జనవరి 6: ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి రాసిన సాహిత్యంలో సమాజం పుస్తకావిష్కరణ, అంకితం రాజ మహేంద్రవరం తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్యపీఠంలో వైభవంగా జరిగింది. బొమ్మూరులో ఉన్న సాహిత్య పీఠంలో చదివి వివిధ హోదాల్లో పనిచేస్తున్న పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి రచించిన సమాజంలో సాహిత్యం పుస్తకాన్ని పూర్వ విద్యార్థులంతా కలిసి ఆవిష్కరించారు. ఈశ్వర్‌రెడ్డి, పర్యవేక్షకులు ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు కడప రమణయ్య దంపతులకు పుస్తకం అంకితం చేశారు. కష్టాలకు భయపడకుండా శ్రమించడంతోనే ఈశ్వర్‌రెడ్డి ఈ స్థాయికి వచ్చారని, సాహిత్యపీఠానికి ఎందరో సాహిత్యకారులను తయారు చేసిన ఘనత లభిస్తుందని కడప రమణయ్య అన్నారు. ప్రముఖ కథా రచయిత్రి డాక్టర్ మల్లీశ్వరి, కవి డాక్టర్ గూటం స్వామి, ద్రవిడ విశ్వవిద్యాలయం ప్రొఫెసరు శ్రావణకుమార్, హరిక్రిష్ణ, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

గతేడాది మూల్యాంకన పారితోషికం చెల్లించాలి

కడప(ఎర్రముక్కపల్లె), జనవరి 6: గతేడాది జరిగిన పదోతరగతి మూల్యాంకన విధుల పారితోషికాన్ని తక్షణమే ఉపాధ్యాయులకు చెల్లించాలని లేదంటే 2024లో జరిగే పరీక్షల మూల్యాంకన విధులను బహిష్కరిస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు హెచ్చరించారు. శనివారం కార్యాలయంలో డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ గతేడాది టెన్త్ మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో పారితోషికం చెల్లించకుండా అరకొర చెల్లింపులు చేశారన్నారు. జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు వ్యయప్రయాసలకోర్చి మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వహిస్తే ఉపాధ్యాయులకు టీఏ డీఏలు కూడా చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన పరీక్ష ఫీజులు సైతం ప్రభుత్వం పరీక్షల నిర్వహణకు సజావుగా ఖర్చు చేయకపోవడం తగదన్నారు. తక్షణం పారితోషికం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1.20లక్షలు



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏసీ ముకుందరెడ్డి

చక్రాయపేట, జనవరి 6: గండి క్షేత్రంలో చేపట్టిన శాశ్వత నిత్యన్నదాన పథకానికి దాతల నుంచి రూ. 1.20లక్షల విరాళాలు వచ్చినట్లు ఆలయ ఏసీ ముకుందరెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లె వాసులు దివంగతులు నేతి గురుమూర్తి జ్ఞాపకార్థం వీరి ధర్మపత్ని మునెమ్మ కుటుంబ సభ్యులు రూ.50116 అందించారన్నారు. వీరికి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, వేద ఆశీర్వచనం అందించారు. శనివారం గండికి అంజన్న దర్శనానికి వచ్చిన భక్తులు రూ.70వేలు అందించారన్నారు.

క్రీడల ద్వారానే ఉజ్వల భవిష్యత్తు

క్రీడాసామగ్రి పంపిణీ

వేంపల్లె, జనవరి 6: చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని ఏపీఐఐసీ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా ముగింపు క్రీడా ఉత్సవాలు వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జరిగాయి. క్రీడాకారులకు క్రీడా సామగ్రి, టీషర్ట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, ఎంపీడీఓ దివిజ, ఈఓఆర్డీ మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

పులివెందుల రూరల్, జనవరి 6: నల్లపురెడ్డిపల్లె, ఇకొత్తపల్లె, కదిరి రోడ్డు, సరస్వతి మైన్స్, ఇండస్ట్రియల్ ఫీడర్ల పరిధి ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ రూరల్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో కోరారు.

ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 6: ప్రతి పౌరుడు ఓటరు నమోదు చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ పీఓ షకీలాబేగం పిలుపు నిచ్చారు. శనివారం కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు కడప నగరంలో రవీంద్రనగర్ ప్రాంతంలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ప్రజలకు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి అరుణ్, బీఎల్ఓ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టరు అరుణ, ఎన్ఎస్ఎస్ పీఓ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి

కడప(కలెక్టరేట్) జనవరి 6: వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రాకతో పలువురు పార్టీ తీర్థం తీసుకుంటున్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుశీల్ కుమార్ చొరవతో 26,42వ డివిజన్లకు చెందిన పలువురు చేరారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయమన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనే సంకల్పంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ షర్మిల పార్టీలో చేరడంతో కాంగ్రెస్ వాదులు పెద్ద ఎత్తున పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతుండడం శుభపరిణామన్నారు. 42వ డివిజన్ ఇన్‌చార్జిగా ఎస్ మహమ్మద్ సాధిక్, 26వ డివిజన్ మెడికల్ విభాగం అధ్యక్షుడిగా పి.గోపిని నియమిస్తూ నగర అధ్యక్షుడు నియమాక పత్రాలను ఇచ్చారు.

జెన్కో ఉద్యోగులకు జీతాలు వెంటనే చెల్లించాలి



ఆందోళన చేస్తున్న ఆర్టీపీపీ ఉద్యోగులు

ఎర్రగుంట్ల, జనవరి 6: ఏపీ జెన్కోలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులకు జీతాలు 1వ తేదీనే చెల్లించాలని డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో శనివారం ఉదయం ఉద్యోగులు పవర్‌హౌస్ గేటు ముందు ఆందోళన చేశారు. ప్రతి నెల జీతాలు ఆలస్యంగా చెల్లిస్తున్నారని, డిసెంబర్ నెల జీతాలు ఇప్పటి వరకు చెల్లించికపోవడం దారుణమన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.సుబ్బిరెడ్డి, తులసినాథ్‌రెడ్డి, రమణయ్య, వీరారెడ్డి, వెంకటస్వామి, వెంకటరామిరెడ్డి, వెంకటరమణ, ఖాజా, నరేంద్రరెడ్డి, రామకృష్ణరెడ్డి, గంగాధర్, మనోహర్, హరిటబుల్‌రెడ్డి జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల ఆందోళన

మైదుకూరు, జనవరి 6 : ఈనెల 6వ తేదీ దాటుతున్నా జీతాలు ఇవ్వలేదంటూ విద్యుత్ కార్మికులు శనివారం మైదుకూరులోని ఆందోళన చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌స్టేషన్ వద్ద కార్మికులు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామమోహన్, నాయబ్ రసూల్, నాగసుబ్బయ్య పాల్గొన్నారు.

కొండాపురం రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ వసతి కల్పించండి

జమ్మలమడుగు, జనవరి 6: కొండాపురం రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ వసతి కల్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి రాయలసీమ బీజేపీ మైనార్టీ మోర్చ జోనల్ ఇన్‌చార్జి ఎస్‌కే మహమ్మద్‌రఫి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఏలూరు జిల్లాలో వినతి పత్రం అందించి రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్లకు సంబంధించిన ప్రయాణికుల ఇబ్బందులను వినతి పత్రంలో తెలియజేసి సమస్య పరిష్కరించాలని కోరినట్లు ఆయన తెలిపారు. వెంటనే ఆమె స్పందించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడి వర్క్‌షాప్ ప్రారంభం



కూచిపూడి నృత్యం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 6 : నృత్య తరంగిణి కళానిలయం ఆధ్వర్యంలో భరత కళ వసంతపేరుతో శనివారం వైఎంఆర్ కాలనీలోని లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్‌లో కూచిపూడి నృత్యంపై వర్క్‌షాప్ ప్రారంభించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వసంత్ కిరణ్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కేరళ, కర్ణాటకు చెందిన కూచిపూడి విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. విద్యార్థులకు కూచిపూడి నృత్యంలోని అడుగులు, జటులు, తాళాలు, నట్టువాంగం, సంగీతం, శాస్త్రపాఠాలు, జలంధరం వంటి అంశాలపై బోధించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆదివారం కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి కూచిపూడి నృత్యంలోని శాస్త్రపాఠాలు, మెళకువలను బోధిస్తారని నృత్య తరంగిణి కళానిలయం నిర్వాహకుడు తేళ్ల శ్రావణ్ కుమార్ తెలిపారు.

'అధిష్ఠానం న్యాయం చేయాలి'

కాశినాయన జనవరి6: వచ్చే సాధారణ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా తన పేరును ప్రకటించి అధిష్ఠానమే తనకు న్యాయం చేయాలని గత శాసనసభ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థి ఓ.రాజశేఖర్ కోరారు. శనివారం నర్సాపురంలో టీడీపీ నాయకుడు కే.వెంకటరెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్న తనను రాజకీయాల్లోకి తీసుకు వచ్చారన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినప్పటికీ ప్రజలమధ్యనే ఉన్నానన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూ వచ్చానని తనపై కేసులు కూడా పెట్టారని గుర్తుచేశారు. ఈ విషయాలన్నింటినీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకుపోతానన్నారు. టీడీపీ నాయకులు పి.బాలిరెడ్డి, మాజీ జడ్పీటీసీ బీరం శిరీష, కొత్తపు మునిరెడ్డి, బీరం జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్మాకు భయపడేది లేదు

రోజురోజుకూ ఉధృతమవుతున్న అంగన్‌వాడీల సమ్మె ● మద్దతు తెలుపుతున్న పలు సంఘాలు



ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు

ప్రొద్దుటూరు,జనవరి 6 : అంగన్‌వాడీ కార్యకర్తలు 26 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సింది పోయి ఎస్మా లాంటి చట్టాలను ప్రయోగించి ఉద్యమాన్ని అణగదొక్కాలనుకోవడం చేతకానితనం అని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద చేపడుతున్న అంగన్‌వాడీల సమ్మె 26 వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ నేతలు సత్యనారాయణ, విజయ్‌కుమార్, శేఖర్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: రాష్ట్ర ప్రభుత్వ బెదిరింపులకు భయపడేవారు లేరని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. శనివారం జమ్మలమడుగులో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులను ఉపయోగించి ఎస్మా పేరుతో బెదిరిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నిరసనలు తెలుపుతుంటే అధికారులపై ఒత్తిడి తెచ్చి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు ఫోన్లు చేసి బెదిరించడం తగదన్నారు. అంగన్వాడీల దీక్షకు ఏఐటీయూసీ నాయకులు కుళాయమ్మ, నరసమ్మ, విజయ్, డేవిడ్‌రాజు తదితరులు మద్దతు పలికారు.

కొండాపురం..: తమపై ప్రభుత్వం ఎస్మాచట్టం ప్రయోగించడంపై మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు మండిపడ్డారు. అందుకు నిరసనగా మెడకు ఉరితాళ్లు వేసుకొని తమ నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దనూరు..: సీఎం జగన్మోహనరెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు శనివారానికి 26వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కల్పించినా, సమస్యలు పరిష్కరించేంత వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు.



ఎర్రగుంట్లలో ధర్నాకు మద్దతు తెలుపుతున్న సీఎంసురేష్‌నాయుడు

మైదుకూరు..: సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయిన ప్రభుత్వం తమపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమని అంగన్‌వాడీలు శనివారం నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. 26 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె కొనసాగుతోంది.రిలే దీక్షల సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు సమ్మెకు మద్దతు పలికారు. కాగా శనివారం నాటి దీక్షలో లక్ష్మి, చెన్న క్రిష్ణమ్మ, చెన్నకేశవమ్మ, ధనలక్ష్మి, వీరమ్మ, రజియా కూర్చున్నారు.

చాపాడు..: తహసీల్దారు కార్యాలయం ఎదురుగా శనివారం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఎం జగన్ తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని వారు కోరారు.

ఎర్రగుంట్ల..: అంగన్వాడీలు 26రోజులుగా ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం.సురేష్‌నాయుడు ధ్వజమెత్తారు. శనివారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యలయం వద్ద చేస్తున్న ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని వచ్చిన వెంటనే అంగన్వాడీ న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీల నాయకురాళ్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: అంగన్వాడీ కార్యకర్తలు తహసీల్దారు కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో పింఛన్ల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్సీ గోవిందరెడ్డిని ఆప్కాస్ డైరెక్టరు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని సమ్మె జరుగుతున్న ప్రదేశానికి రావాలంటూ అంగన్వాడీలు నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వారితో మాట్లాడి వారి సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళతామన్నారు. అనంతరం వారు ఆయనకు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో భైరవ ప్రసాద్ చిన్నయ్య, ఓబులాపురం విజయమ్మ, మేరీ, వినోద, మండల నాయకురాళ్లు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం స్థానిక సీడీపీవో కార్యాలయం ముందు రిలేదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకురాలు సుభాషిణి, హుసేనమ్మ,సత్యవతి, కళావతి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం అదృష్టం

రాజుపాలెం, జనవరి 6 : సంజీవరాయస్వామి ఆలయ పునర్నిర్మాణం చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నామని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం ఆలయ పునర్నిర్మాణం కోసం భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కానాల విజయలక్ష్మి, ఈవో డీవీ నరసయ్య, ఎంపీపీ సలోమి, గుద్దేటి రాజారంరెడ్డి, గోపల్లె సర్పంచ్ గోవర్ధనరెడ్డి, జడ్పీటీసీ అంజనీదేవి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

విష్ణుసహస్రపారాయణం చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 6 : ప్రతి ఒక్కరూ విష్ణు సహస్రనామ పారాయణం చేయాలని బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శనివారం విశ్వహిందూ పరిషత్, వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్ కుమార్, శివశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి కళ్యాణ్‌కుమార్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 6 : కేసీ పుల్లయ్య జ్ఞాపకార్థం ప్రతి ఏడాది పేద విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ఛైర్మన్ కె.అనిల్ కుమార్ తెలిపారు. గత ఏడాది 80 శాతంపైగా మార్కులు సాధించిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, పాలిటెక్నిక్, మెడిసిన్ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, 500 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తామన్నారు. ఇతర వివరాలకు 9949516637 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పందేల విజేత 'ప్రొద్దుటూరు'

● మూడు స్థానాల్లోనూ కడప జిల్లా కైవసం

నెల్లూరురూరల్, జనవరి 6 : నెల్లూరురూరల్లోని కోడూరుపాడులో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో కడప జిల్లా ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన ఎం.కేశవ్ ఎడ్ల జత విజేతగా నిలిచింది. రెండూ, మూడు స్థానాల్లోనూ కడప జిల్లా ఎద్దు కైవసం చేసుకున్నాయి. కోడూరుపాడులో ఉన్న ఊళ్లమ్మ మహాకుంభాభిషేకం ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 25 జతల ఎద్దు పాల్గొన్నాయి. ఈ పోటీలో కేశవ్ ఎడ్ల జత నిర్ణీత సమయానికి 2,280 అడుగులు బండలాగి ప్రథమ స్థానంలో నిలిశాయి. అలాగే కడపకు చెందిన కర్నాటి విశ్వనాథరెడ్డి ఎద్దు 2,060 అడుగులు లాగి రెండవ స్థానం, కడప జిల్లాకు చెందిన భావనశ్రీ ఎడ్ల జత 2,040 అడుగులు లాగి మూడవ స్థానంలో నిలిచాయి. వీరికి నిర్వాహకులు ప్రథమ బహుమతి రూ. 50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు అందచేశారు. పోటీలను విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోడూరు కమలాకర్‌రెడ్డి, లేబూరు పరమేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్‌లు ప్రారంభించారు.

అయ్యప్ప గుడికి 15 లక్షలు విరాళం

మైదుకూరు, జనవరి 6 : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి వైసీపీ నాయకుడు రాచమల్లు రవిశంకర్‌రెడ్డి 15లక్షల రూపాయలు చెక్కును విరాళంగా అందచేశారు. పులివెందులలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎంపీ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా ఈ చెక్కును ఆలయ నిర్మాణ నిర్వాహకులు ఓంకారం రమణ, గురుస్వామి అయితారాజుల వేణుగోపాల్, కామనూరు శ్రీనివాసులు, సభ్యులకు చెక్కును అందచేశారు.

టీడీపీని ఆదరించండి : రోశన్న



1వ వార్డులో ప్రచారం చేస్తున్న బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, జనవరి 6 : టీడీపీని ఆదరించండి.. చంద్రబాబునాయుడును సీఎంగా చేయండి అని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. శనివారం పోరుమామిళ్లలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పోరుమామిళ్లలోని 1వ వార్డుతో పాటు మరికొన్ని వీధుల్లో టీడీపీ మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు పంచుతూ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, సీతా వెంకటసుబ్బయ్య, రామసుబ్బారావు, సీతాబాలాజీ, కల్వకూరి చిన్నవెంకటసుబ్బయ్య, మల్లికార్జునరెడ్డి, ఇమాంహుసేన్, రంతుల్లా,కరీముల్లా, గఫూర్, షరీఫ్, ఎస్ఎం బాషా, శెట్టెం ప్రతాప్, ప్రొఫెసరు బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోపై మహాశక్తి ప్రచారం

పోరుమామిళ్ల, జనవరి 6 చంద్రబాబు రూపొందించిన టీడీపీ మేనిఫెస్టో పథకాలను మహిళలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. శనివారం పోరుమామిళ్లలోని 12వ వార్డులో టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న సతీమణి బొజ్జ అరుణరాజీ, టీడీపీ పార్లమెంటు మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి హబీబున్నీసా ప్రచారం నిర్వహించారు.

సంక్షోభంలో వ్యవసాయం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, జనవరి 6: వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శనివారం ఎర్రగుంట్ల మార్కెట్ యార్డులో నిర్వహించిన 19 ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ప్రసంగించారు. ఈకార్యక్రమంలో ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, కాటమయ్య, జిల్లా కార్యదర్శి జి.చంద్ర, పోటిరెడ్డి భాస్కర్, మనోహర్‌రెడ్డి, బషీరున్నీసా, మునెయ్య, శ్రీరాములు, పల్లవోలు రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీఈశ్వరిదేవి అమ్మవారి గురుపూజ



బ్రహ్మంగారిమఠం, జనవరి 6 : ఈశ్వరీ మహాదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక అలంకరణలో గుడి ఉత్సవంలో దర్శనమిచ్చారు. ఉదయం మఠాధితులు వీరకుమారస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఈశ్వరీ దేవి శనివారం పుష్ప రథోత్సవంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు.

సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం లక్ష్యం : ప్రవీణ్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 6 : రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి చేపట్టడమే టీడీపీ ప్రధాన లక్ష్యం అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మూడో వార్డు రాంనగర్‌లో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, బండి భాస్కర్‌రెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, తాటి శ్రీను యాదవ్, పాణ్యం సుబ్బరాయుడు, పొట్టిపాటి గంగాధర్ సుబ్రహ్మణ్యం, రాజా, రాము, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాపాడే వ్యక్తి చంద్రబాబు ఒక్కరే

ప్రొద్దుటూరు , జనవరి 6 : అప్పుల ఊబిలో వున్న రాష్ట్రాన్ని కాపాడగల సమర్థుడు చంద్రబాబు ఒక్కరేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల టీడీపీ కన్వీనర్‌బోడెల బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో బంకచిన్నయ్య పల్లె,బొజ్జవారిపల్లెలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, ఉప్పరపల్లి సుధాకర్‌రెడ్డి, గంగులవెంకటరెడ్డి, కల్లూరు వసుంధర, రామ్మోహన్‌రెడ్డి, ఆవుల దస్తగిరి, పట్నంమాబాషా,గోపవరం గౌస్‌మోద్దీన్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : భూపేశ్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న భూపేశ్‌రెడ్డి

ముద్దనూరు జనవరి6: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్ రెడ్డి పేర్కొన్నారు.మండల పరిధిలోని బడుగువారిపల్లె శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిపెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బడుగువారిపల్లె టీడీపీ నాయకులు నడిపి ఓబులేసు, సుబ్బిరెడ్డి,సుబ్బారెడ్డి, బాబ్జి, ఓబులేసు, మహేష్, చిన్నఓబులేసు, నాగేంద్ర, మల్లి, అబ్దుల్‌ఖాదర్, భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి,జగదీశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు గ్యారంటీపై జనం ఆసక్తి

గోపవరం, జనవరి 6 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చేపట్టిన బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీపై ప్రజల్లో పెద్ద ఎత్తున ఆసక్తి నెలకొందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మామిడి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు మామిడి సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, నాయుడు, మల్లికార్జునరెడ్డిలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

బద్వేలు రూరల్, జనవరి 6 : రిత్విక్ ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ ప్రాజెక్టు సైట్ ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన రహదారి మైదుకూరు - బద్వేలు రోడ్డులోని డి.అగ్రహారం వద్ద శని వసతి గృహాన్ని ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగరు, ఈసీజీ, గుండె సమస్యలు ఉన్న రోగులకు అధునాతన సాంకేతికతతో 2డీ ఎకో నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కడప నగరంలోని హోలిస్టిక్ హాస్పిటల్ నుంచి ప్రత్యేక వైద్యులు, పుష్పగిరి హాస్పిటల్ నుంచి కంటివైద్య నిపుణులు వైద్యశిబిరంలో ఉన్నట్లు వారు తెలిపారు. ఆదివారం కూడా వైద్యశిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహించొద్దు

ఖాజీపేట, జనవరి 6: విద్యార్థులపట్ల అశ్రద్ధ వహించవద్దని హాస్టల్ సిబ్బందికి మైదుకూరు సివిల్‌జడ్జి ఖాజామొయినుద్దీన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బాలికల వసతి గృహాన్ని, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో అంతా కలియతిరిగి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్వాలా నరసింహశర్మ, లాయర్లు నాగిరెడ్డి, జె.కె.చారి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మునిసిపల్ కార్మికుల సమ్మె



బద్వేలు, మైదుకూరులో నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు

ప్రొద్దుటూరు, జనవరి 6 : మున్సిపల్ కార్మికుల డిమాండ్లు నెరవేరనిదే సమ్మె విరమించబోమని మున్సిపల్ కార్మిక సంఘం నేతలు చంటి,సాల్మన్ హెచ్చరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంను కార్మికులు ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమ్మెను ఎలాగైనా ప్రభుత్వం విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నది తప్ప పరిష్కారం వైపు ఆలోచించడంలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, కోశాధికారి రాఘవ, సహాయకార్యదర్శి మోహన్ ఉపాధ్యక్షులు గుర్రమ్మ నీతమ్మ, రమాదేవి, ప్రమీళమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామలు అమలు చేయాలని కోరుతూ చేపట్టి సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈసమ్మెలో బీసీ సంఘం నాయకులు గురుమూర్తి, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు షేక్ ఆఖిల్, సీఐటీయూ పట్టణ నాయకులు రాజగోపాల్, యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షులు దేవమ్మ, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్ , జేవీ.రమణారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, కోశాధికారి నరసయ్య, నాయకులు దేవా, వెంకటేష్, నరసింహులు, వెంకటరెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: తమ సమస్యలు పరిష్కరించాలంటూ శనివారం మున్సిపల్ కార్మికులు మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, కల్యాణ్, చిన్న ఓబులేసు ఆదినారాయణ, బండి రాజ, చెండ్రాయుడు తదితరులు పేర్కొన్నారు.